



"కథ చెబుతా వింటావే రాధా" అన్నాడు గోపాలం కాఫీగ్లాసు కింద పెట్టి సిగరెట్టు జేబులోంచి తీస్తూ

"అక్కడికి పేపరు చదవడం అయింది. ఇంక కథలు మొదలు కావాలో" అంది రాధ కత్తిపీటా కూరలబుట్టా ముందరేసుకుని కూర్చుంటూ.

"పేపరు తరవాత విందు గానిలే. కథ టూకీగా చెప్పేస్తా విను కథ పేరు శశి రేఖా స్వయంవరం. శశి హీరోయిన్. దృశ్యం వానరోజు రాత్రి. సమయం ఆరు గంటల బైస్కోపు వదిలిన తొమ్మిది గంటల వేళ. రంగం నిద్రపోతున్న పెంకుటింటి అరుగు"—సిగరెట్టు ముట్టించాడు గోపాలం. "ఊఁ కొట్టూ," అన్నాడు పొగ వదుల్తూ.

చెక్కు తీసిన అరటికాయని నీళ్లలో పడేస "ఊఁ. చెప్పండి" అంది రాధమ్మ.

"సరే మొదట హీరో మోహన్ వస్తాడు రంగంమీదికి వానలో తడవడానికి ఇష్టంలేక అరుగెక్కి నించున్నాడు. రెండు నిమిషాల తేడాలో హీరోయిన్ శశి కూడా తానే వచ్చింది. అరుగుమీదకి ఇంకెవ్వరు రారు అనుకో......రెండే పాత్రలు "

"మీరు, పేపరు చదువుకోండి బాబూ కవిత్వం కట్టేసి" అంది రాధ

"లేదే కథ అయిపోవచ్చిందిగా. ఆ కుఱ్ఱాడు ఎదురుగా ఉన్న వేపచెట్టూ, పచ్చ మేడా, పెంకుటిల్లూ, వలమబ్బూ, పల్చని చందమామా, పక్కనున్న భామా మొదలైన వాటివంక మానడం మానేసి కేవలం శూన్యంలోకి చూడసాగాడు "

## ముళ్ళపూడి వెంకట రమణ

"ఏం పాపం?" అంది రాధ తల ఎత్తకుండానే.

"అరుగుమీది భామ సుధకూడా ఈ ముక్కే అనుకుంది. ఇదివరకే హీరోని అక్కడక్కడ చూసినట్టు గుర్తు రాగానే ఈ ముక్కే అడిగేసింది.

ఆకుఱ్ఱాడు ఈపిల్లవంక ఓసారి చూసి మళ్లా శూన్యంలోకి దృష్టిసారించి; ఆ పైన అటూ ఇటూ ఊగుతున్న ముంగురులు చూసుకోడం మొదలెట్టాడు . బాధగా."

"ఏం పాపం?" అంది రాధ చిరునవ్వుతో.

"అరుగుమీది భామ సుధకూడా అదే అడిగింది మళ్ళీ —అప్పుడే తను చూసివచ్చిన సినిమాలో హీరోయిన్ తొలూకు హృదయ కాఠిన్యానికి బలిఅయిన హీరోకి చెందిన హృదయం శతచ్ఛిద్రాలయిపోవడం కళ్ళారా చూసినమీదట తనకి స్త్రీజాతిపై గౌరవం విశ్వాసం నశించి, అంతకుముందే ప్రేమతో, కన్నీళ్లతో నిండి, స్థానిక కన్య మోసానికి గురియైన తన హృదయకుండ పగిలిపోయిందనీ—"

"కుండేమిటండీ! నా తలకాయ-భాండం"

"—ఆ కుఱ్ఱవాడు గబగబ చెప్పేసి మళ్ళీ ముంగురులు చూసుకోడం మొదలెట్టాడు - వేడిగా బరువుగా రొప్పుతూ. ఆవటాన, ఆ పిల్లకి ఆ పిల్లవాడి జుట్టు సవరించాలనిపించిందట"

రాధ నవ్వింది "అవును గానండి, ఆ పిల్లకి అదేం బుద్ధండి. అలా అరుగులమీద కనిపించిన మొగాళ్ల జుట్టు సవరించడమేమిటండీ

"ఏమో! ఆడవాళ్ల హృదయంలోతని షేక్స్పియరు గామోసన్నాడు. నాకు బాగా తెలీదు. కథవిందూ. ఆ పళంగా ఆ అమ్మాయి ఏమందో తెలుసా? సరే నవ్వాడు. జరిగిం

# ★ రాధమ్మ బాకీ ★

ఏదో జరిగిందీ, ఆ ముక్క లీలా పోశ్తే అది అతికి నేను దాన్ని జీవంతో నింపుతానూ, నీ కిష్టమేనా అందిట" - గోపాలం విరగబడి నవ్వసాగాడు తన చమత్కారానికి. రాధ ముక్కుమీద వేలేసుకుంది. "అయ్యో! తన ముక్కు మొహం ఎరగని పరాయివాడితో అవేం మాటలండీ" అంది సాగతీస్తూ.

"ముక్కు మొహం తెలియడానికి ఆ పిల్లముక్కు నీ మల్లె కొట్టొచ్చినట్టు కనబడుతుందనుకున్నావా? ఆ పిల్లది మామూలు ముక్కే."

"బావుంది మధ్య నా ముక్కు గొడవెందుకు లెండి. కథ కానీండి."

"కథకేముంది అయిపోయినట్టే. ముందు వాకుర్రాడు ససేమిరా స్త్రీని నమ్మనన్నాడు. ఆ పిల్ల కాదు కూడదంటూనే అటు తిరిగి ఏడుపు లంకించుకుంది. అప్పుడు కుర్రాడు ఆ పిల్లవంక తిరిగి నీ పేరేమిటన్నాడు. 'సుధ' అని చెప్పి, 'నీపేరో' అంది. మోహన్ అన్నాడు. అంటూనే 'సుధా!' అన్నాడు గాఢంగా. హృదయం చీల్చుకొచ్చిందిలే ఆ మాట. వెంటనే సుధ కూడా మోహన్! అంది.—ఇదికూడా హృదయం చీల్చుకు వచ్చిందేలే."

"రెండూ హృదయం చీల్చుకొచ్చినవే నన్నమాట బావుంది. ఆ తరవాత?"

"తరవాత నీకు తెలియందేముంది?" రాధ కోపం ప్రకటించింది.

"నాకేం తెలుస్తాయిలెండి. ఓ హృదయమా! ఓ ప్రేమా! అనడమూ మీకే తెలుసు. అవతలవాళ్లని హృదయకుండా, అదీ ఇదీ అంటూ వెక్కిరించడమూ మీకే కావచ్చు. ఓడ దాటాక బోడిమల్లయ్యా అన్నాట్ట ఎవరో—"

"కోప్పడకు రాధా! నేననేదది కాదు."

"ఏదయినా అనండి నాకేం—అన్నీ మీకే చెల్లాయి." అంది రాధ మూతి ముడుచుకుని.

గోపాలం విరగబడి ఇంగ్లీషులో నవ్వాడు. "ఆల్ రైట్ వాల్ రైట్ అమ్మాయ్? నేను ఓడదాటలేదూ, బోడిమల్లయ్య అనలేదు లే. మాది కాశీమీది రామేశ్వరం. మా నాన్నా మీ నాన్నా విశాఖపట్నంలో కలుసుకుని నన్నూ నిన్నూ ఓ ఇంటివాళ్లని చెయ్యాలనుకున్నారు; చేశారు. పెద్దలు ఆశీర్వదించి తదర్పిత చందన తాంబూలాది పత్రాలు స్వీకరించారు; మంగళం మహత్ శ్రీ శ్రీ శ్రీ నువ్వూ నేనూ మొగుడూ పెళ్లాం. అంతకుముందు నేను నిన్ను చూడలేదు. ప్రేమించలేదు. అంతేనా? అమ్మయ్య!" అంటూనే గోపాలం పేపరు చాటేసుకుని చెడా మడా చదవసాగాడు.

"ఆఁ! అంతే అంతే - మీ రలా వెక్కిరించారు గాబట్టి అంతే" అంది రాధ ఉల్లిపాయలు బయటకు తీస్తూ.

గోపాలం పేపరు వెనకనుంచి తొంగి చూసి "ఉల్లిపాయలు నాకు పడవు అవి మానెయ్... తరవాత, నాకు హృదయం లేదన్నావు గాబట్టి నా బాకీ యిచ్చెయ్యి" అన్నాడు దబాయింపుగా.

"మీ బాకీ ఏమిటీ!" అంది రాధ కళ్ళు చిట్లించి.

"మన పెళ్ళికి ముందరి ఎష్టాబ్లిష్ మెంటు ఛార్జీలు" అన్నాడు గోపాలం.

"ఎష్టాబ్లిష్ మెంటు ఛార్జీ లేమిటి"—

"ఎరగనట్టే పెద్ద—నువ్వే అంటూ ఉంటావుగా బోలెడు ఉత్తరాలు నీకు రాశానని! వాటికీ వాటికీ అయిన ఖర్చులు ఇచ్చెయ్."

"బావుంది. నేను మిమ్మల్ని ఉత్తరాలు రాయమని పిలిచి బొట్టెట్టి అడిగానా?— నాకేం తెలీదు బాబూ."

"అదేం కుదరదమ్మాయ్. మర్యాదగా బాకీ తీర్చు లేకపోతే మీ నాన్నమీద కేసు పెడతా."

"ఇది మరీ బావుందండీ. మా నాన్న మిమ్మల్ని పిల్చి నాకు లెటర్సు రాయమని చెప్పాడా?" అంది రాధ నుదురుమీద నుంచి ముఖానికి అడ్డంగా వేళ్ళాడుతున్న మెత్తని కురులను పైకెగతోసుకుంటూ.

గోపాలం కంగారుపడ్డాడు. "అహాఁ! అవలా ఉంచు. తీసెయ్యకు. అవలా ఉంచేనే నాకు బావుంటుంది......అది సరే. మీ నాన్నమీద వైకేరియస్ లయబిలిటీ ప్రకారం కేసు పెడతాను. అమాయకుడినైన నా హృదయాన్ని ఆకర్షించి, - శాస్త్రం చెప్పినట్టు - నాచేత ఉత్తరాలూ అవీ రాసేటట్టు చేశావు. నువ్వు అప్పటికి మైనరువి కాబట్టి, ఇందులో మీ నాన్నకి ప్రత్యక్ష సంబంధం లేకపోయినా ఆయనదే బాధ్యత - ఇదంతా ఎందుకంటావూ - హాయిగా పేపరు చదువుతా వినెయ్"

రాధ తల పైకెత్తి పకపక నవ్వింది. "నా మొహంలా వుంది మీ ప్రతిపాదన" అంటూ.

గోపాలం అనిమిషుడై ఆమెవంక చూసి, ముగ్ధుడైపోయాడు.

"రాధా! దేవుడు నీకింత అందం, ఇన్ని గుణాలూ, చక్కని మనస్సూ ఇచ్చి, పేపరు చదవాలన్న ఉత్సాహం ఇవ్వనందుకు విచారిస్తున్నాను. పోతే పోయిందిలే. పేపరు వినవద్దు. అంతే కాదు ఉల్లిపాయలు కూడా తరుగు. నేను మెల్లిగా పాడుతూ ఉంటాను."

రాధ తుళ్లిపడింది. "ఏమండీ! ఇలా చూడండి. పోనీ ఆ పేపరేదో చదవండి. మీ మాట కాదనడం నా కిష్టంలేదు."

గోపాలం చదివాడు—"అని ఉద్ఘాటించి ఆయన ఇంకా ఇలా అన్నారు..."

"ఏమండీ! ఇలా చూడండి—"

"ఏం? ఏఁవొచ్చింది?"

"మీకు అరిటికాయి అవపెట్టి వండితే ఇష్టమా, లేకపోతే కమ్మగా పోపులో వేస్తే బావుంటుందా చెప్పండి. పుల్లగా పులుసు ఉండనే ఉంటుంది."

గోపాలం పెదిమలు బిగించాడు. అలవాటు ప్రకారం నాసాపుటాలు ఎగరేశాడు. హుంకరించడానికి భయపడ్డాడు. గుటకమింగాడు. "రాధా! నువు నా బాకీ దీర్చవు. పాటవినవు. పేపరుకూడా వినవు.




లల్లూరాం అండ్ కో

స్థాపితము 1928.

ఎన్నో సంవత్సరాలుగా మన్నికకు, నాణ్యతకు, సరసమైన ధరలకు ప్రసిద్ధిచెందిన

* ఇనుప పెట్టెలు * ఉక్కుబీరువాలు
* క్యాషు బాక్సులు

లల్లూరాం అండ్ కో

వెలగలేటివారి వీధి, :: విజయవాడ - 1.

"కొత్త షోరూము - మారుతి సినిమా ఎదురుగా."

నేను కోర్టుకి వెళ్ళి తీరతాను. ఆఁ." అన్నాడు.

"ఏమో బాబూ కోర్టుకే వెళ్తారో గోలు కొండ కెళ్తారో కోటిపల్లి కెళ్తారో మీ ఇష్టం. మళ్ళీ వంట ఆలిశ్యమైందని నామీద ఎగరకూడదు"

"నా బాకీ తీర్పవా అయితే?"

"ఇదెక్కడి గోలండీ! పెళ్ళాందగ్గిర బాకీ వసూలు చేస్తానంటారు...నాకేం తెలీదు...అదుగో ఎవరో వస్తున్నారు చూడండి."

ఆ వచ్చిన 'ఎవరో' మహా దూకుడుగా వచ్చి వంటింటి గుమ్మంమీద ఆగాడు. అతగాడి పేరు. జి. వి. మూర్తి.

గోపాలానికి క్షణంలో జి. వి. మూర్తి రావడం ఆశ్చర్యం వెయ్యలేదు.

మొగుడూ పెళ్ళాలూ పొద్దుటిపూటల్లో కాఫీలు తాగి సరదాగా సరసాలాడుకుంటూంటే, జి. వి. మూర్తులూ, ఎస్. కె. రావులూ కొంప లంటుకుపోతున్నట్టు ఇలా కొంపల్లో వచ్చెయ్యడం బావులేదనుకున్నాడు గోపాలం.

జి. వి. మూర్తిమాత్రం ఈ దంపతుల చిరచిరలూ కొరకొరలూ చూసి, బోలెడు ముచ్చటపడి, వాళ్ళ నాయనమ్మ అనే "చిలకా గోరింక" అనే మాట జ్ఞాపకం చేసుకుని ఎంతో ఇదైపోయాడు.

"ఏరా ఎల్. కె. గోపాలం! ఏమమ్మా ఎల్. కె. రాధాగోపాలం! కులాసా ఆ? కాఫీ లయ్యాయా?" అన్నాడు టైము చూసుకుంటూ.

గోపాలానికి ఒళ్లు మండిపోతున్నది. ఇక లేస్తూనే "ఏరా జి. వి. మూర్తి?" అన్నాడు. అప్పుడు జీవీ మూర్తి 'ఊఁ ఏరా?' అన్నాడు. ఎల్. కె. గోపాలం 'ఆఁ. ఏవుందిరా?' అన్నాడు. మళ్ళీ జీవీ మూర్తి 'ఊఁ. ఇంకేమిటా!' అన్నాడు టైము చూసుకుంటూ. ఎల్కె గోపాలం పేపరు చాపేసుకుని 'హుఁ. ఏముందిరా?' అన్నాడు.

రాధ పకాలున నవ్వింది. "బావుంది రా. మొత్తానికి ఈ ప్రభాతవేళ మీ సంభాషణతాత్పర్యం 'ఏముదిరా' అంటే 'ఏంలేదురా' అనేదని నాకు సులభంగా అర్థమైపోయింది. సరే కాని, మూర్తిగారూ, మా ఆయన్ని ఒక్కసారి అలా అలా తిప్పి, అవీ ఇవీ చూపించి తీసుకురండీ బాబూ. చిటికెలో వంటచేసేస్తాను. పొద్దుటినించి ఒక్కటే అల్లరి." అంది నవ్వుతూ.

గోపాలం పేపరు చాటునించి తొంగి చూసి, "హుఁ అల్లరి. మరేఁ అల్లరి. నేను కదూ? - సరేలే. నీకూ నాకూ పేచీ ఎందుకు?" నువ్వు పేపరు వినొద్దు బాగుపడొద్దు. నా బాకీ ఇచ్చెయ్యి" అన్నాడు.

"మానేశారండీ మూర్తిగారూ పొద్దుట్నించీ ఒక్కలా వేధిస్తున్నారు బాకీ బాకీ అనీ. నేను బాకీ ఏమిటండీ!"

గోపాలం పేపరు కింద పడేశాడు. "సరే ఆ మాటమీద నిలు. మొదటినించీ వీడికి మన సంగతి తెలుసుగద! వీడు మనకి సాక్షి. అందులోనూ బొత్తిగా నిజం చెప్పేరకం - చెప్పరా సింగినాదం ఇది నాకెంత బాకీనో—"

సింగినాదం టైము చూసుకున్నాడు. "ఒరేయ్! ఆప్తమిత్రుడూ! - నువ్వు ఈ ఆదివారం పొద్దున్నే నను సింగినాదం అన్నందుకూ, నేను నిజం చెప్తానని ఆరోపించినందుకూ - కాసుకో నిజంగా నిజం చెప్పేస్తాను. ఏది శాశ్వతం-అమ్మాయీ! రాధా-" అంటూ రొప్పసాగాడు.

"ఉండండి. కొంచెం ఆగండి." అంటూనే రాధమ్మ లేచి ప్లాస్కులోంచి కొంచెం కాఫీ తెచ్చిఇచ్చింది. జీవీమూర్తి సిగ్గుపడ్డాడు. హూ అన్నాడు. కాఫీయా అన్నాడు కాఫీవంక చూసి. హుఁ కాఫీ అన్నాడు చిరునవ్వుతో. కాఫీ ఎందుకండీ అన్నాడు. రాధనిచూసి కాఫీ రా గోపాలం అన్నాడు గోపాలాన్ని చూసి. ఓ గుటక తాగి, కాఫీ అని నిర్ధారణగా చెప్పినవాడు. తరవాత గడగడ తాగేశాడు. గుడ్లు మిటకరించి చూశాడు.

తక్షణం గోపాలం సిగరెట్టు అందిచ్చాడు. "జాగ్రత్తరోయ్! నిజంచెప్పాలి. నిజం. - ఏది. నిజం తెలుసుగా! నిజం." అన్నాడు.

"ఓ! తెలియకేం బోల్డు తెలుసు—ఇది అసలు నిజం లేరా అప్పలసామీ! రాధమ్మా వీడికి - అనగా నీ భర్తదేవుడికి - అనగా ఎల్కె గోపాలంగాడికి నువ్వు 80 రూపాయలు బాకీ వున్నావు. ఇది నిజం. నిన్ను వీడు గాంచిన శుభముహూర్తంనించి, నిన్ను పెళ్ళాడిన శుభదినానికి 15 రోజులముందరి రోజు సాయంత్రం 8 ఘంటలవరకూ వివిధ పద్దులక్రింద వీడు నీ నిమిత్తం 80 రూపాయలు ఖర్చుచేశాడు - అందులో నా దగ్గర అప్పుగా తీసుకోబడి ఇంకా ఇవ్వబడకుండా ఉన్న మొత్తం 20 రూ॥లు అనే వాక్యాన్ని బ్రాకెట్లలో వేసుకోవాలనుకో - నిజానికి నిజం ఇది." ఆగి టైము చూసుకున్నాడు.

గోపాలం మూర్తి భుజం తట్టాడు. "ఒరేయ్ సింగినాథం ప్రేమనాథం రామనాథం! నువ్వురా నిజమైన స్నేహితుడివి!" అన్నాడు.

"ఇవ్వాళ ఊళ్ళో కొత్తసినిమా ఏవిటండీ?" అంది రాధమ్మ అనుమానంతో చూస్తూ.

మూర్తి గడపమీద కూర్చున్నాడు. "రాధమ్మా ఇది నిజమమ్మా నను నమ్మ సుమా" అన్నాడు నవ్వుతూ.

గోపాలానికి ఉషారు హెచ్చింది. "జానే రాణీ అలిపేణీ" అన్నాడు ఊతగా.

"బావుందండీ మేజువాణీ! మీరిద్దరూ ఇక్కణ్ణించి దయచెయ్యండి. నేను వంట చేసుకోవాలి" అంది రాధ గబగబా అరటికాయ తరుగుతూ.

గోపాలం నవ్వాపాయాని కొచ్చాడు. "సరేలే రాధా లెఖ్ఖచెబుతాను విను. నీకు నేను పంపిన గ్రీటింగ్సు కార్డులు పాతికేనా ఉంటాయికద? - పాతికా పాతిక రూపాయలనుకో. పోతే - ఉత్తరాలు. స్పెషల్ కవర్లో రాశాను. అవో పది పన్నెండు రూపాయ లవుతాయిగద! ఇంకేం ఇప్పటికే బోలెడయింది."

"ఏమన్నాళ్ళి నేనేం పంపమని అడిగానా?" అంది రాధ.

"పెద్ద. ఇంకో ఇంకోళ్ళైతే అడిగినట్టు. నువ్వు అడిగే దేమిటి. నీ ధోరణే తెలిసిపోయింది. ఎప్పుడు ఎక్కడ కనపడ్డా నన్ను చూసి నవ్వేస్తేదానివి. దాన్ని పట్టి మొగ కుంక ఏమనుకోవాలి?"

"నవ్వకపోతే ఏడవనా! లేపోతే వెక్కిరించనా? రోజూ స్కూలు దారిలో కనపడుతూనే ఉంటిరి. అదలా ఉంచండి. మిగతా 40 రూపాయలకీ ఏం లెఖ్ఖ చెబుతారు?"


## నారసింహ లేహ్యము




బంగారు చేర్చబడినది. మేహము, నిశ్శక్తి, నిస్సత్తువ, శుక్లనష్టమును హరించి బలమును, కాంతిని, వీర్యవృద్ధిని కలిగించు వరప్రసాదము—

20 తు॥ డబ్బి రు. 8-4-0 పోస్టేజి 15 అ.

పి. పి. ఏ. & కంపెని. "ఆయుర్వేదసమాజం" పెరిదేపి- నెల్లూరు జిల్లా.

## నపుంసక తైలం

అంగనరములు బలహీనతచెంది చిన్నదై తిరిగి యథాప్రకారమై పూర్తి సౌఖ్యమును అనుభవించుటకు 48ఏండ్లుప్రఖ్యాతి చెందిన గ్యారంటీ మందు. 1 సీసా రూ 10/-లు. వి. పి. రూ 1-4-0

కావలసినవారు రు. 1/4 ముందుగా పంపేది.

డా॥ రత్నం సన్సు మెడికల్ హాల్, మలకపేటబిల్డింగ్సు, హైద్రాబాదు-(దక్షన్)

# ★ రాధమ్మ బాకీ ★

"నే చెప్తా నే చెప్తా" అన్నాడు మూర్తి. "నువ్వు రోజూ కనపడేదానివి కదూ! అప్పుడూ—"

రాధ అందుకుంది. "ఇది మరీ బాగుందండోయ్! నేను కనపడడ మేవిటి. నేను నాదారిన స్కూలు కెళ్ళేదాన్ని. ఈయనేమో రోజూ కిళ్ళీకొట్టుదగ్గర హాజరుగా ఉండేవారు. ఎలక్ట్రిక్ స్థంభాలూ, పోస్టుడబ్బా, గంటస్థంభం, నల్లపిల్లవాడూ వరసగా కనపడేవారు. రోజూ పందెం నాకు మా ఫ్రెండ్సుతో. ఇవాళ ఈ నల్లబ్బాయి వస్తాడని నేనూ, రాడని వాళ్ళూ. నేనే నెగ్గేదాన్ని."

"నాన్సెన్స్...నువ్వు చాలా పొరపాటు పడుతున్నావు రాధా. నేనేం నీకోసం రాలేదు రోజూ. ఏదో తోచక తొమ్మిదిన్నరకి అలా షికారుగా వచ్చేవాణ్ణి. కదరా సాయిబూ!" అన్నాడు గోపాలం.

"అవునవును. వెన కెవ్వడో విలాసార్థం కట్టెలు కొట్టుకుంది కెళ్ళేవాడుటలే. అలాగే నువ్వూ విలాసార్థం ఎండలో షికారు వెళ్ళేవాడివి" అన్నాడు మూర్తి–గోపాలంవంక చూడకుండా.

రాధ పకపక నవ్వింది. "అంతేనండి. మీకు తోచక, ఈయన వెంట షికారుకి సాయం వచ్చేవారు కాబోలు."

"అంతేలేగాని, చెప్పేది వినవమ్మా. సరిగ్గా తొమ్మిదింబావుకి స్నానంచేసి పగటివేషం ప్రారంభించేవాడు. తొమ్మిదీ నలభైకి ఆఖరి పౌడరు కోటింగూ, ఆఖరిసారి డ్రాపు మాలీసూ పూర్తి చేసి బీటుకి తయారయ్యేవాడు."

"పగటివేష మేలెండి. మా స్నేహితురాళ్ళనేవారు. 'ఆ నల్లపిల్లవాడి మొహం తెల్లపౌడరు మయం కదే రాధా' అని. నాకు నవ్వొచ్చేది"

"అదుగో ఆ నవ్వే కొంపముంచింది. అది చూసి వీడు తలక్రిందులైపోయేవాడు. నాకు రెండు కాప్స్టన్ సిగరెట్లు కొనిచ్చేవాడు." జీవీ మూర్తి ఆగి, గోపాలంవంక చూశాడు.

అతగాడి ముఖం పేపరువెనుక ఎర్రగా ఎలిగిపోతోంది. కళ్ళు ఎర్రబడ్డాయి మూర్తికి వుషారు హెచ్చింది.

"ఇంక చూడమ్మా! నువ్వు వెళ్ళిపోయాక మా ఇంటి వసారాలో కూర్చుని, బరువుగా పొగ నిట్టూరుస్తూ—"ఆ అమ్మాయి కళ్ళలో ఏదో ఏదో వింతవెలు గుందిరా! నా హృదయం అర్థంకాని ఆ వేదనతో నిండిపోతోందిరా అంటూ బోలెడు చదివేవాడు. నేను పేపరు చదువుకుంటూ వుండేవాణ్ణనుకో—"

గోపాలం తొంగిమూసి, తూచి తూచి, కోపంగా అడిగాడు. "అయితే నువ్వు అపుడు సానుభూతితో వినలేదా?"

మూర్తి ఓ దార్ఢ్యగా నవ్వాడు. "పూర్తిగా అంత ఇది కాదులేరా..అన్నట్టు రాధా! ప్రతిరోజూ నువ్వు వస్తావూ రావూ అనో, వీణ్ణి చూస్తావూ చూడవూ అనో, సందేహం పెట్టుకుని, అంతసేపూ నాకు సిగరెట్లూ వక్కపొట్లాలూ కొనిచ్చేవాడు. ఆ కిళ్ళీకొట్టు నాయరు ఆ రోజుల్లో ఓ సెకండుహాండు కారు కూడా కొన్నాడు. ఇంక, నువ్వు సాయంత్రం కనపడితే, మా ముఠాకి కాఫీ కాస్థాలు కొనిచ్చేవాడు."

గోపాలం ఛర్రుమన్నాడు. "విడిశావుతే


# ఆర్. ఎమ్. డి. సి. క్రాస్‌వర్డ్సు

నెం. 228 సూపర్ బంపర్

రు. **1,51,000** లలో మొదటి బహుమతి రు. **1,10,000** పంచుకొన్నవారు



టి. గణేశన్,
నెం. 48/4, సౌత్
అసరే వీధి, రామ్నాడ్



దుండిగల్ల కృష్ణమూర్తి,
C/o ప్రభు ఎలెక్ట్రిక్ కంపెని,
రాష్ట్రపతి రోడ్డు,
సికిందరాబాదు.



ఎస్. కుప్పుస్వామి,
30, మెట్టుకామాల సందు,
దక్షిణ అవని మూల వీధి,
మదుర.



ఎస్. ఎస్. శెతి,
బొంబాయి సేల్సు కార్పొరేషన్
హంసరాజ్ దామోదర్ వాడి,
కెన్నెడీ బ్రిడ్జి, బొంబాయి-4

తరువాతి పోటీ ఆఖరు తేది జూన్ 8 వ తేది మంగళవారం

తప్పక గెలవాలి. **10,000** రు॥ లకు పైగా

ఒక ఎంట్రీ: 0–4–0; ఎనిమిది ఎంట్రీలు రు 1/- 40 ఎంట్రీలు రు 2–8–0;
కలెక్టర్ అండ్ లోకల్ రెంట్రీకాన్ను సెంటర్లవద్ద, ఎంట్రీ కూపనులు ఉచితంగా లభించును.

నోయ్ కవిత్వాలు చదవకు. ఏదో ఫ్రెండ్సు కదా అని ఖర్చుపెట్టాగాని, ఈవిడకోసం కాదు" అన్నాడు.

గోపాలం ఉడుక్కోడం చూసి మూర్తికి ఉత్సాహం పూనింది.

"అంతేకాదు. నువ్వు తెల్లచీరా నల్లరవికా కట్టుకొస్తే మాకు సినిమా. నువ్వు గ్రీటింగ్సు కార్డు అందుకొన్నట్టుగా నవ్వితే సినిమా ప్లస్ కాఫీ హౌస్. శ్రావణ మాసంలో నువ్వు నాగరం పెట్టుకుని కనపడిన మర్నాడు వాళ్ల తమ్ముడికీ నౌకరికీ చాక్లెట్లు పట్టించేశాడు."

రాధమ్మ విరగబడి నవ్వింది.

"ఆఖరి కథ చెబుతా విను రాధమ్మా! ఊర్మిళ పెళ్ళి జ్ఞాపకం ఉందా? అప్పుడు మేమిద్దరం వచ్చాం నువ్వు అక్కడికి వస్తావుగదా అని. తీరా నువ్వూ వచ్చాక ఏంచేశాడో తెలుసా? నా మొహం జిడ్డు కారిందిరా మూర్తీ నువ్విక్కడే వుండూ, అవటాని, వద్దు మొర్రో అని నేను గోల చేసినా వినకుండా బస్సెక్కి మూడుమైళ్లు వెళ్ళి మొహాం కడుక్కుని పౌడరు కొట్టుకుని వచ్చాడు. సరే తీరా వీడు ఇలా వచ్చాడు. రెండు నిముషాలలో నువ్వూ వెళ్లిపోయావు. భలే కోపం వచ్చిందిలే వీడికి — అదీ సంగతి అంతేత వీడికి నువ్వు వందరూపాయలు బాకీ అన్నా ఆశ్చర్యంలేదు."

గోపాలానికి కోపం ఏడుపూ ముంచుకొచ్చాయి. "సరేలేరా మూర్తి. నేనే చవటనిలే. నువ్వు సైకిలేసుకుని ఊరంట తిరిగి సాయంత్రానికి సినిమాటిక్కెట్లు బుక్ చేసుకురా. పదింటికి ఇక్కడికి భోజనానికి రా. ఏయ్! రాధా! నువ్వు అరటికాయి కూరలో ఉల్లిపాయి వెయ్యడం మానెయ్యి. వీడిక్కూడా అన్నం వండు. నా బాకీ తీర్చకు ఆ" అన్నాడు గబగబా.

జీవి మూర్తి ఈలపాట పాడుతూ సైకిలు తీసుకుని వెళ్లిపోయాడు.

గోపాలానికి కోపం ఇంకా తగ్గలేదు ఎక్కువైంది. అటుతిరిగి కూర్చుని పేపరు చదవసాగాడు. —"అని ఉద్ఘాటించి ఆయన ఇంకా అలా అన్నారు."

రాధకి అనురాగం పెల్లుబికింది. చిరునవ్వుతో, కత్తిపీట పక్కకితోసి, అతని దగ్గర చేరింది. "ఏవండీ, ఇలా చూడండి. మిమ్మల్నే —" అంది అతని మెడని మునివేళ్ళతో తాకుతూ. గోపాలం కోపంగా చదవసాగాడు.

"ప్రస్తుత పరిస్థితులలో భారతీయులంతా ...అబ్బ కళ్లు మూయ్యకు రాధా! నాజోలికి రాకు."

"రాధ ఇంకా గట్టిగా కళ్లు మూసింది.

"కోపం లేదంటే కాని,—" అంది నవ్వుతూ.

"ఊఁ కోపం లేదులే."

"అయితే ఆ పేపరు అలా పారేసి ఇటు తిరగండి మరి."

ఏం అన్నాడు గోపాలం ఇటు తిరుగుతూ. రాధ మళ్ళీ కత్తిపీటదగ్గరకి చేరింది.

"నేను మీ కెంత బాకీ అన్నారు?" అంది ఉల్లిపాయలు ఒలవడం సాగిస్తూ.

"ఉల్లిపాయలు వద్దని చెప్పలే?" అన్నాడు గోపాలం.

"అబ్బే మీ క్కాదులెండి — కాశికి — సరే చెప్పండి బాకీ ఎంతన్నారు?"

"ఎంతో కొంతలే...ఎనభై. ఏం?"

"కోప్పడకండి మరి. కొంచెం ఆగండి." అంటూ నే అరిటికాయ ముచ్చికతో గచ్చు మీద లెక్కలు వేసింది రాధ.

గోపాలం మూడుసార్లు స్వల్ప విరామాలతో నిట్టూర్చాడు. రాధ లెక్క పూర్తి చేసి తల తృప్తిగా తాటించింది.

"ఊఁ సరే. నా గోల వినండి కొంచెం. లెక్కప్రకారం, మీరు నాకు బాకీ ఉన్న మొత్తంలోంచి, నేను మీకు బాకీ ఉన్న మొత్తం తీసేస్తే మీరే నాకు 70 రూపాయలు బాకీ. ఇలా పడెయ్యండి. సాయంత్రం గొలుసు కొనుక్కుంటాను."

గోపాలం అనుమానంతో చూశాడు. "నువ్వు చెప్పేది నేను నీకు ఎదురివ్వాలనా" అన్నాడు.

"కాను మీరు నాకు ఎదురివ్వాలి."

"నేను నీకు — అంటే నీకు నేను బాకీ వుంటానా?" అంటూ చప్పగా జాలిగా నవ్వాడు గోపాలం.

"మహారాజులా. పాపం మీ కొక్కరికే హృదయాలూ అవీ వుంటాయి. మీరే మనుషులు. మేమంతా రాక్షసులం అనుకున్నారా!"

"అబ్బే: దేవత లనుకు నేవాడిని."

"బొత్తిగా కాదు. మీరు అనుకున్నప్పుడూ, అనుకుంటున్నప్పుడూ, అనుకోబోయేటప్పుడూకూడా మనుషులనే అనుకోండి. ఏం. మీకు పచ్చజార్జెటు చీర ఇష్టమని మీరు ఉత్తరం రాసినప్పుడు - వన్ వే ట్రాఫిక్కే అనుకోండి — నేను, మా అత్తయ్యనడిగి ముప్ఫయి రూపాయలు అప్పు చేసి, మూడోనాటికే అది కట్టుకుని కనపడలేదూ. మీకు సంతోషమని తెలిసి, ఆదివారం తలంటు మానుకుని సోమవారంనాడు —బడికి టైమైపోతున్నా — తలంటు పోసుకుని వచ్చేదాన్ని కాదూ! మీ కిష్టమని కాటిక పెట్టుకునేదాన్ని ముఖానా పసుపు ఛాయలు మిగుల్చుకునేదాన్ని. కాళ్లకి పట్టా చేయించుకున్నా. అప్పట్లు — నాగరం కొన్నా! ఆ. ఇవన్నిటికీ అయిన దబ్బు ఇచ్చుకోండి."

గోపాలానికి బోలెడు సంతోషం వేసింది. చివరిసారి పెంకితనం చేశాడు.

"ఇవన్నిటికీ అనకూడదు. వీటన్నిటికీ అనాలి" అన్నాడు నిర్వికార స్వరంతో.

"బావుంది మధ్యలో వ్యాకరణంకూడ ఇంకో పోట్లాటా?"

"వీటికి అనకూడదు — గురించి అనాలి."

కాని చెప్పకపోయింది.

"ఆదివారం సాయంత్రాలలో మీరు పిలిచివస్తే మా ఫ్రెండ్సుకి పకోడీలు కొనేదాన్ని. మీరు గ్రీటింగ్సు కార్డులు పంపితే మా చెల్లాయికీ, సీతకీ చాక్లెట్లు కొనిచ్చేదాన్ని. ఇలాగ నాకూ బోలెడు ఖర్చు అయింది. ఆ అప్పట్లు, అసలు కథ. పెద్ద మీ గవర్నమెంటుద్యోగం చూసుకే నేను తప్పుకునేవట్టు. ఆనాళ్ల ఊర్మిళ పెళ్ళికి మీ రొస్తారుగదా అని మా ఫ్రెండ్సుని వ్యాటుసినిమా మానిపించి ఆరు గంటలదాకా ఉంచి, పెళ్ళిపాటికి నాతో తీసుకువచ్చాను వాళ్లందరికీ బస్సు చార్జీలు, కాఫీలు ఇప్పించుకొని తెచ్చాను. తీరా వచ్చాక మీరు ఇక్కడ కనపడి అలా మాయమైపోయారు. గంట సేపు చూసి, మా ఫ్రెండ్సువారు పనిలేక సినిమాకి బయల్దేరుతుంటే మీరు అప్పుడు పౌడరు కొట్టుకుని వచ్చారు. నేను వెళ్లిపోతే నాదా తప్పు. గంటసేపు మీరు నన్ను విడిపిస్తే అవన్నీ కృష్ణలీలలు కాబోలు. మీకొకా హృదయముంటుంది. మేం రాక్షసులం" గోపాలానికి తెరతొలగ దనిపించింది.

"ఇంత ప్రగాఢ ప్రేమ ఉందా రాధా నీకూ" అని తెలుగు వాక్యాలలో అనుకున్నాడు.

క్షమార్పణ కోరుకున్నట్టుగానూ, సంతోషం ప్రకటిస్తున్నట్టుగానూ "రాధా!" అన్నాడు బరువుగా బాధగా అందంగా ఆనందంగా ఇంకా రకరకాలుగా.

రాధ ఉల్లిపాయాలు వదిలేసి చేరిచూసింది గోపాలంవంక.

"ఇదికూడా హృదయం పిల్చుకువచ్చిన మాటేకదూ? ఇందాక మీరు కలలో చెప్పలేదూ?" అంది నూటిగా.

"హృదయాంతరాళాలలోంచి వెలికిన మాట రాధా."

"అయితే ఉల్లిపాయలు తరగొచ్చునా?"

"నిరభ్యంతరంగా."

కిలకిల నవ్వుతూ చప్పట్లు కొట్టింది రాధ. ఆమె చేతి గాజులు గలగల మన్నాయి.

★